క్లుప్తంగా...

'బలగం' రెస్టారెంట్ ప్రారంభం



అల్వాల్: నేరేడ్‌మెట్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన బలగం రెస్టారెంట్‌ను సినీ నటుడు మంచు మనోజ్ బుధవారం రాత్రి ప్రారంభించారు. మనోజ్‌తో పాటు గబ్బర్ సింగ్ గ్యాంగ్ పాల్గొన్నారు. అంతకుముందు మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు రెస్టారెంట్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని యాజమాన్యానికి సూచించారు.

విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి: వసంతపురి సబ్‌స్టేషన్ 11కేవీ బీజేఆర్‌నగర్, సాయిరాం థియేటర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల వలన గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సుధీప్‌రెడ్డి తెలిపారు.

కేసీఆర్‌నగర్‌లో మౌలిక వసతులు కల్పిస్తాం



కేసీఆర్‌నగర్‌లో పర్యటిస్తున్న బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని కేసీఆర్‌నగర్‌లో బుధవారం ఉప్పల్ టీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి విస్తృతంగా పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌నగర్‌లో పలు బస్తీల్లో భూగర్భ డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సమస్యలు ఉన్నట్లు తాను గుర్తించినట్లు, ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావుతో పాటు బీఆర్ఎస్ నేతలు శ్రీకాంత్‌గౌడ్, సూరం శంకర్, చాంద్ పాషా, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి



అల్వాల్: అల్వాల్ గౌడ సంఘం సీనియర్ నాయకులు నేమూరి గణేష్‌గౌడ్ మూడో వర్ధంతి వేడుకలు బుధవారం అల్వాల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరై ఉచితంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.

కవితను కలిసిన బొంతు శ్రీదేవి



కుషాయిగూడ: మహిళా బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన సందర్భంగా బుధవారం ఎమ్మెల్సీ కవితను చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. మహిళా బిల్లు అంశాన్ని పార్లమెంట్‌లో పలుమార్లు పాలకుల దృష్టికి తీసుకెళ్లి ఆమె చేసిన కృషిని కొనియాడారు. మహిళా శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లి కవితకు శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్ఎస్ నేత శ్రీరామ్ సత్యనారాయణ మృతి



మల్లాపూర్: నాచారం డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నేత శ్రీరామ్ సత్యనారాయణ అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు శాంతి సాయిజెన్ శేఖర్, పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య తదితరులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. సాయంత్రం నాచారం ఎర్రకుంటలోని శ్మశానవాటికలో అంత్యక్రియలను పూర్తి చేశారు.

గణేష్ నిమజ్జనం షురూ..



ఉప్పల్ బేబి పాండ్‌లో..



ఉప్పల్ నల్ల చెరువు వద్ద నిమజ్జనం చేస్తూ..

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలో గణేష్ నిమజ్జనాలు మూడో రోజైన బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఒక్క రోజే చిన్నవి పెద్దవి కలిపి దాదాపు 150 వినాయక ప్రతిమల నిమజ్జనం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. పెద్దఎత్తున హాజరవుతున్న భక్తులు వినాయకుడిని భక్తిశ్రద్ధలతో గంగమ్మ ఒడికి పంపిస్తున్నారు. ఉప్పల్‌లో స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి కొలనులో నీరు, పరిసర ప్రాంతాల్లోని సౌకర్యాలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దాదాపుగా 600కు పైగా మండప నిర్వాహకులు మండపాలను రిజిస్టర్ చేయించుకున్నట్లు పోలీస్ అధికారులు చెబుతున్నారు. రిజిస్టర్ కానివి వందల సంఖ్యలో ఉండవచ్చని అంటున్నారు.





రామంతాపూర్ ప్రధాన రహదారిలోని డీమార్ట్ వద్ద పూజల్లో ప్రభాకర్, కార్పొరేటర్ శ్రీవాణి





హబ్సిగూడలో వినాయకుడి పూజల్లో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



విమలాదేవినగర్‌లో మహిళల సామూహిక పారాయణం



ఉప్పరిగూడ రాజానగర్ వినాయక దేవాలయంలో..

నాచారంలో ఇస్రో చంద్రయాన్-3 గణనాథుడు

అభివృద్ధికి సహకరిస్తే మైనంపల్లిపై ఆరోపణలా?



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు

- చిల్లర రాజకీయాలు వద్దు
- పీఎన్ఆర్ సొసైటీ ప్రతినిధులు

మల్కాజిగిరి: కాలనీ అభివృద్ధికి సహకరిస్తే ఎమ్మెల్యేపై కబ్జా ఆరోపణలు చేయడం తగదని పిల్లి నర్సింగరావు సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ అన్నారు. బుధవారం మల్కాజిగిరిలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల పిల్లి నర్సింగరావు కాలనీలో స్థలాల ఆక్రమణకు ఎమ్మెల్యే వత్తాసు పలుకుతున్నారని బీజేవైఎం నాయకుడు టీంసాయి, కొంతమంది ఆరోపణలు చేయడం అవాస్తవం అన్నారు. ప్రభుత్వ స్థలంగా భావించి పేద ప్రజలు గుడిసెలు వేసుకున్న స్థలంలో సీపీఎం పోరాటం చేసిందన్నారు. ప్రస్తుతం స్థలం ప్రైవేటు వ్యక్తులైన యూసఫ్‌బేగంకు చెందిందన్నారు. పేదల పరిస్థితి చూసి భూమికి సంబంధించిన యజమానితో చర్చించామని, 2010లో మూడు ఎకరాల 28 గుంటల స్థలాన్ని సొసైటీ పేరుతో సేల్ అగ్రిమెంట్ కమ్ జీపీఏ చేయడం జరిగిందన్నారు. ఆ స్థలంలో గుడిసెలు వేసుకున్న పేదలకు 42 గజాల చొప్పున కేటాయించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మల్కాజిగిరి ఎమ్మెల్యే కాకముందే కాలనీ అభివృద్ధికి సహకరించారన్నారు. ఎమ్మెల్యే అయిన తర్వాత మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా సహకరించారన్నారు. సొసైటీ కేటాయించిన సర్వే నంబర్లకు బై నంబర్లు వేసిన కొంత మంది కబ్జాదారుల వద్ద కొనుగోలు చేసి మహిళలు మోసపోయారన్నారు. వారిపై గతంలో కేసులు నమోదు కావడంతో జైలుకు వెళ్లడం కూడా జరిగిందన్నారు. వారికి సొసైటీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. స్వార్థ రాజకీయాల కోసం వారిని ఆసరా చేసుకొని ఎమ్మెల్యే, పోలీసు అధికారులపై అవాస్తవాలు ప్రచారం చేయడాన్ని సొసైటీ సభ్యులతో పాటు కాలనీవాసులు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చిల్లర రాజకీయాలు వద్దని సొసైటీ పేరుకు నష్టం కల్గించేలా వ్యాఖ్యలు చేస్తే చట్ట ప్రకారం వెళ్తామని హెచ్చరించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, కాలనీవాసులు గణేష్, సత్యనారాయణ, మంగ, నజీమాతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధిలో దూసుకుపోతున్న పీర్జాదిగూడ

సాధారణ సర్వసభ్య సమావేశంలో మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి



సాధారణ సర్వసభ్య సమావేశంలో మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: అభివృద్ధిలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఇతర మున్సిపల్ కార్పొరేషన్లకు ఆదర్శంగా నిలిచిందని మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మేయర్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం రూ.2.77కోట్లను పలు అభివృద్ధి పనులకు కేటాయించి కార్పొరేటర్ల సంక్షేమంలో 35 అంశాలతో కూడిన ఎజెండాను ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 100శాతం తడి పొడి చెత్త సేకరణకు స్వచ్ఛ్ ఆటోలతో పాటు అదనపు కార్మికులను కేటాయించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. దోమల నివారణ చర్యలు, సమీకృత వ్యర్థాల శుద్ధీకరణ పాఠశాల, కళాశాల విద్యార్థులకు తడి, పొడి చెత్త, హానికరమైన చెత్తపై అవగాహన కల్పించేందుకు అవసరమైన మెటీరియల్ ఉండే విధంగా ఏర్పాటుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషనర్ కమిషన్ ఇస్లావత్ నమ్య, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో విద్యుత్ సమస్యలకు పరిష్కారం



కుషాయిగూడ: డివిజన్ పరిధిలోని ఓల్డ్ మీర్‌పేట్, న్యూనర్సింహనగర్, ఎన్టీఆర్‌నగర్ కాలనీల్లో త్వరలోనే విద్యుత్ సమస్యలు తీరనున్నాయని కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. ఆయా కాలనీలో తరచూ విద్యుత్ అంతరాయం సమస్యను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లడంతో బుధవారం ఆయన ట్రాన్స్ కో అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. విద్యుత్ అంతరాయానికి గల కారణాలను అధికారులకు వివరించారు. నూతనంగా రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తే లో వోల్టేజీ సమస్యతో పాటు విద్యుత్ అంతరాయ సమస్యలు ఉండవని అధికారులకు సూచించారు. అందుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సాధ్యమైనంత త్వరగా సమస్య తీరే విధంగా చూస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఏఈ కిష్టయ్య, లైన్‌మెన్ వెంకటేష్, కాలనీసంక్షేమ సంఘాల ప్రతినిధులు రాకేష్, రాజు, శ్రీనివాస్, వేణు, ఖబీర్, విశ్వనాథ్, రమేష్‌గౌడ్, అలీబాయ్, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మరకత లక్ష్మీ గణపతి స్వామికి పూజలు



అల్వాల్: కానాజీగూడలోని మరకత శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం నరసింహ అవతారంలో స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారని ఆలయ వ్యవస్థాపకులు మోత్కూరు సత్యనారాయణ శాస్త్రీ తెలిపారు.

రక్తదానం మహాదానం



మందులు అందజేస్తున్న కె.హరీష్‌రెడ్డి తదితరులు

కుషాయిగూడ: రక్తదానం మహాదానమని లయన్స్ డిస్ట్రిక్-320సి గవర్నర్ కట్టంగూర్ హరీష్‌రెడ్డి అన్నారు. డాక్టర్ ఏఎస్‌రావు 109వ జయంతి సందర్భంగా ఈసీఐఎల్‌లోని సాయి సుధీర్ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఏఎస్‌రావునగర్, లయన్స్ క్లబ్ ఆఫ్ కాప్రా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదానం చేసేందుకు వచ్చిన విద్యార్థులను ఆయన అభినందించారు. వైద్య పరీక్షలు చేసిన వైద్యులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్యాంపు కో ఆర్డినేటర్ మాకవరం శ్రీదేవి, కళాశాల కరస్పాండెంట్ ఆర్.ఉషారాణి, ప్రిన్సిపల్ మీరా, నీలంరెడ్డి, మండా సురేష్‌కుమార్, విజయ్‌కుమార్, వరప్రసాద్, కేఎస్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మనోజ్‌కుమార్, గణేష్, డాక్టర్ ప్రకాశ్, నాగన్న, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు



అల్వాల్: అల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు దేవాదాయశాఖ పర్యవేక్షణాధికారి నరేందర్ సమక్షంలో బుధవారం జరిగింది. హుండీ లెక్కింపు ద్వారా రూ.2,53,350 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ఎం.వీరేశం తెలిపారు. హుండీ లెక్కింపులో ఫౌండర్ రాజా సంజయ్‌గోపాల్ సైంచర్, సురేందర్‌రెడ్డి, రాంచందర్‌రావు, శివరామక్రిష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లలో అక్రమాలపై విచారణ జరిపించాలి



అల్వాల్ డీసీ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎన్.బాలమల్లేష్

అల్వాల్: రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో పెద్ద ఎత్తున అక్రమాలు, అవినీతి జరుగుతోందని, దానిపై సమగ్ర విచారణ జరిపి దళారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ అల్వాల్ మండల శాఖ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి బాలమల్లేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 2016 నుంచి అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వేలాది మంది సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై జరుగుతున్న అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించాలని అల్వాల్ ఉపకమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

డబుల్ ఇళ్ల కేటాయింపులో అవకతవకలు

మల్లాపూర్: డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరుగుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం అనేక అనుమానాలకు తావిస్తోందని సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి దామోదర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో మల్లాపూర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వకుంటే నియోజకవర్గ వ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ ఉప్పల్ మండల సహాయ కార్యదర్శి కె.ధర్మేంద్ర, మండల కార్యవర్గ సభ్యులు టి.సత్యప్రసాద్, భిక్షపతి, నర్సింగ్‌రావు, కృపాకర్, శోభ, ఏఐవైఎఫ్ నేత గిరి బాబు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు



బోడుప్పల్: ఇటీవల సరూర్‌నగర్‌లో జరిగిన 33వ కరాటే, కుంగ్‌ఫూ జాతీయస్థాయి పోటీల్లో బోడుప్పల్‌లోని హేమానగర్ ఎస్ఆర్ డీజీ పాఠశాల విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను జోనల్ ఇన్‌చార్జి సుమలత అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసన్న, కరాటే మాస్టర్లు సంపత్, వసీం పాల్గొన్నారు.

వందేభారత్ ట్రైన్ ప్రారంభంపై హర్షం

మల్కాజిగిరి: కాచిగూడ నుంచి యశ్వంత్‌పూర్ వరకు వందేభారత్ ట్రైన్ ప్రవేశపెట్టడం పట్ల బస్ అండ్ ట్రావెలర్స్ అసోషియేషన్ మల్కాజిగిరి కార్యదర్శి నూర్ హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ డివిజన్‌లో తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల వారికి ఉపయోగపడేలా ట్రైన్‌ను ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. త్వరలో ప్రారంభం కానున్న కాచిగూడ నుంచి సిద్దిపేట వరకు, సిద్దిపేట నుంచి తిరుపతి రైళ్లకు మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

ఉప్పల్: గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు రంగంలోకి దిగి నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాలు.. సూర్యాపేట గోరంట్ల ప్రాంతానికి చెందిన మరికంటి రామూర్తి(23), వరంగల్ జిల్లా లింగాల ఘన్‌పూర్ ప్రాంతానికి చెందిన నీలం సందీప్ కుమార్(24) ద్విచక్ర వాహనంపై సంచిలో పెట్టుకున్న గంజాయితో వస్తున్నారు. పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వారిని వెంబడించి ఉప్పల్ సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2.620 కిలోల గంజాయి, మొబైల్ ఫోన్, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

గుండెపోటుతో ఆలయ స్వీపర్ మృతి



గౌతంనగర్: హిల్‌టాప్ కాలనీకి చెందిన ఎండోమెంట్ ఆలయం జయగిరి లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం స్వీపర్ జగదీష్(జగ్గ) బుధవారం గుండెపోటులో మృతి చెందాడు. బుధవారం ఉదయం ఆలయానికి చేరుకొని ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. గుండెలో నొప్పి రావడంతో సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి జగదీష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. జగదీష్ మృతదేహానికి జయగిరి లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయ ఈఓ రమాదేవి సిబ్బందితో వచ్చి నివాళులర్పించారు. అనంతరం రూ.20 వేలు, స్థానిక బీఆర్ఎస్ నేత మేకల రాముయాదవ్ రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



మల్కాజిగిరి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లును క్యాబినెట్ ఆమోదించడంతో మల్కాజిగిరి చౌరస్తాలో కార్పొరేటర్ శ్రవణ్ ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సునీతాయాదవ్, నాయకులు అంజలి, తిరుమలదేవి, జయమ్మ, శిల్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అల్వాల్‌లో పార్టీ నాయకుడు మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

మౌలాలిలో..

మౌలాలి: మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశ పెట్టడాన్ని స్వాగతిస్తూ కార్పొరేటర్ గున్నాల సునీతాశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంబురాలు

మల్లాపూర్: మహిళా బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలపడంపై బీజేపీ మహిళా నాయకులు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబురాలు జరుపుకున్నారు. ఉప్పల్ మహిళా కన్వీనర్ అనితా పద్మారెడ్డి, డివిజన్ మహిళా అధ్యక్షురాలు మంజువాణి, వరలక్ష్మీ, అరుణ, వినోద, సుమన, బీజేపీ డివిజన్ అధ్యక్షులు మల్కా ప్రకాష్, పద్మారెడ్డి, రవినాయక్, చంద్రమౌళి, రాజిరెడ్డి, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.







మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు